క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

మద్దిరాల : మండలంలో నేడు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పర్యటించనున్నట్లు రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభంలో ఆయన పాల్గొననున్నట్లు తెలిపారు. కావున పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్ని పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, దుగ్యాల రవీందర్‌రావు, గుడ్ల వెంకన్న, వీరన్నగౌడ్, మధుసూదన్, తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో మన ఊరు–మన బడి పథకంలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ రానున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు ఇస్తున్న హెచ్‌ఎం దామెర శ్రీనివాస్

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం దామెర శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ఈ విద్యా సంవత్సరంలో 200అడ్మిషన్లు పూర్తయినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


నెమ్మికల్, గట్టికల్ శివారులోని ఓ పొలంలో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు

ఆత్మకూర్ (ఎస్) : రైతుల వ్యవసాయ క్షేత్రాల్లోని విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని నెమ్మికల్, గట్టికల్ గ్రామాల శివారులో ఉన్న భూముల్లో ఈ స్తంభాలు అధికంగా ఉన్నాయి. ఏ క్షణంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్న ఈ స్తంభాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని సరిచేయాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరూ వహిస్తారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమ్మె నోటీసు అందజేత

అర్వపల్లి : గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నేటి నుంచి జరిగే నిరవధిక సమ్మెకు సంబంధించి మండలంలోని గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు బుధవారం అర్వపల్లిలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లలో సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కె.శ్రీశైలం, యాకూబ్, ప్రవీణ్, బాషా, లింగయ్య, నాగరాజు, యాదగిరి, వెంకటయ్య, రాములమ్మ, పూలమ్మ, కృష్ణ, వీరస్వామి, యుగేంధర్ తదితరులు పాల్గొన్నారు.

మోడువారిన వృక్షం.. ప్రమాదానికి సాక్ష్యం


అర్వపల్లి పాఠశాల ఎదుట ప్రమాదకరంగా ఉన్న చెట్టు

అర్వపల్లి : మండల కేంద్రంలోని తుంగతుర్తిరోడ్డులో ఉన్న ప్రాథమిక పాఠశాల, ఎమ్మార్సీ భవనాల సముదాయం ఎదుట ఉన్న మోడువారిన వృక్షం ప్రమాదకరంగా మారింది. ఈ వృక్షం మోడువారడంతో ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని అటుగా వెళ్లే వారు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సముదాయంలో ఉన్న ఎమ్మార్సీ, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వస్తుంటారు. వారు ఈ చెట్టు పక్క నుంచే సముదాయంలోకి వెళ్తుంటారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు వృక్షాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు డిజిటల్ పాఠాలు

- సర్కారు బడుల్లో ఈ సంవత్సరం నుంచే డిజిటల్ విద్యాబోధన
- 8, 9, 10 తరగతులకు అమలు
- పాఠశాలల్లో పెరగనున్న హాజరుశాతం


లింగాల పాఠశాల తరగతి గదిలో డెస్క్‌లు


గాజులమల్కాపురం పాఠశాలలో డిజిటల్ స్క్రీన్

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే 'మన ఊరు – మన బడి' కార్యక్రమంతో అన్ని వసతులు ఏర్పాటు చేయడంతో పాటు ఇంగ్లిష్ మీడియంలోనూ విద్యా బోధనను అందిస్తుంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో విద్యా బోధన జరుగుతుండగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు 2023–24నుంచి డిజిటల్ విద్యా బోధన అందించేందుకు సిద్ధమైంది. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఒక్కో పాఠశాలలో డిజిటల్ స్క్రీన్ డివైజ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. 8, 9, 10తరగతులకు డిజిటల్ పాఠాలు బోధించేందుకు డిజిటల్ విధానంతో పాఠాలు బోధిస్తే సులభంగా అర్థమవడంతో పాటు ఎక్కువగా గుర్తుంచుకునే వీలుంటుందని ఈ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఇందులో భాగంగానే మొదటి విడతలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గాజులమల్కాపురం, అన్నారం ఉన్నత పాఠశాలలను మన ఊరు– మనబడికి ఎంపిక కావడంతో డిజిటల్ తెరలు ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యా బోధన చేయనున్నారు. అదే విధంగా మండలంలో 18 పాఠశాలలు మన ఊరు –మనబడి కార్యక్రమంలో ఎంపిక కాగా ఇప్పటి వరకు మండలంలోని లింగాల ప్రాథమిక, తంగెళ్లగూడెం ప్రాథమిక పాఠశాలలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు.

మన ఊరు–మనబడితో సకల సౌకర్యాలు..

ప్రభుత్వ చేపట్టిన మన ఊరు–మనబడి కార్యక్రమంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించారు. విద్యార్థుల కోసం విశాలమైన డైనింగ్ హాల్, తాగునీటి వసతి, బాల బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, పెయింటింగ్ రూం, గ్రీన్ చాక్‌బోర్డు, డిజిటల్ బోధన, ఐఎఫ్‌ఎల్ టీవీలు అందుబాటులో ఉన్నాయి. అంతేగాక విశాలమైన క్రీడా ప్రాంగణం ఉంది. ఇందులో భాగంగా 'మన ఊరు – మన బడి'లో మొదటి విడతలో ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ బోధన అందించాలని నిర్ణయించింది.

కొత్తరూపు తీసుకువచ్చాం



మన ఊరు–మనబడి నిధులతో పాఠశాలకు కొత్త రూపు తీసుకువచ్చాం. ఇప్పుడు పాఠశాల కార్పొరేట్‌కు ఏమాత్రం తీసుపోని విధంగా తయారైంది. బోధన కూడా అలాగే చేస్తున్నాం.

– సీహెచ్ రాములు, హెచ్‌ఎం, లింగాల ప్రాథమిక పాఠశాల

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన

విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పాఠాలతో విద్యాబోధన చేస్తున్నాం. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– నకిరేకంటి రవి, ఎంఈఓ



చల్లా అప్పిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి, ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు చల్లా అప్పిరెడ్డి అకాల మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో చల్లా అప్పిరెడ్డి(75) మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాడు జరిగిన వీర తెలంగాణ విప్లవ పోరాటంలో చల్లా సీతారాంరెడ్డి దొరలు, భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సీతారాంరెడ్డి కీలక పాత్ర పోషించారని అన్నారు. వారి కుమారుడైన చల్లా అప్పిరెడ్డి సీపీఎం సభ్యుడిగా పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని అన్నారు. అనేక ఉద్యమాలలో, పోరాటాలలో అప్పిరెడ్డి పాల్గొన్నారని గుర్తు చేశారు. యూటీఎఫ్ నాయకుడిగా ఆ సంఘం విస్తరణ కోసం చేసిన కృషి మరువలేదన్నారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. చల్లా సీతారాంరెడ్డి కుటుంబం మొత్తం కమ్యూనిస్టు పార్టీకి అంకితమై పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యుడు ఎల్గూరి గోవింద్, యూటీఎఫ్ నాయకుడు మల్లు వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అవర్లీ బేసిక్' ఉపాధ్యాయులను కొనసాగించాలి

నాగారం : మోడల్ స్కూళ్లలో గంటల ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులను కొనసాగించాలని హెచ్‌బీటీల (అవర్లీబేసిక్ టీచర్స్) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులను బదిలీ చేస్తామని షెడ్యూల్ విడుదల చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా 194 మోడల్‌స్కూల్స్‌లో అవర్లీ బేసిక్ ప్రాతిపదికన పనిచేస్తున్న 1242 మంది ఉపాధ్యాయులు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీల అనంతరం ఎక్కడైతే ఖాళీ పోస్టులు ఉంటాయో ఆ స్థానాల్లో తిరిగి ప్రస్తుతం పనిచేస్తున్న అవర్లీ బేసిక్ ఉపాధ్యాయులను తీసుకోవాలని కోరారు. అదే విధంగా అవర్లీ బేసిక్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఆయనతో పాటు అవర్లీ బేసిక్ ఉపాధ్యాయులు నర్సయ్య, వీరన్న, యాకూబ్‌పాష, మహేష్, నరేష్ తదితరులు ఉన్నారు.

ఎస్వీవీ డిగ్రీ కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చాలి


ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ఎయిడెడ్ డిగ్రీ కళాశాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా మార్చాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల 1971లో ప్రారంభమై 52సంవత్సరాలుగా నేటికి నడుస్తున్నా కళాశాల స్థలాన్ని ఇతర విద్యాసంస్థలకు వాడటంతో భవిష్యత్‌లో డిగ్రీ చదివే విద్యార్థులకు నష్టం జరిగే పరిస్థితి ఉందన్నారు. ఈ కళాశాలలో సంవత్సరానికి 1600మంది విద్యార్థులు చదువుతున్నారని, పరిసర ప్రాంతాల గ్రామాల విద్యార్థులు చదువుకునేందుకు ఈ కళాశాలకు వస్తుంటారని అన్నారు. జిల్లా మంత్రి చొరవ తీసుకొని కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చి బడుగు బలహీన వర్గాల విద్యార్థుల చదువు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బట్టిపల్లి పరమేష్, వేణు, ప్రశాంత్, సిద్దు, మహేష్, వీరు, రంజిత్, బాలు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేయాలి


భగత్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న యూత్‌క్లబ్ సభ్యులు, గ్రామస్తులు

నూతనకల్ : భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ క్లబ్ సభ్యులు కోరారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రపహాడ్‌లో భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవకెరటం భగత్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య సాధన కోసం తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు. అనంతరం విగ్రహదాత లింగాల అవిలయ్యతో పాటు విగ్రహ ఏర్పాటుకు సహకరించిన వారిని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అనంతుల మహేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు కొంగల నరేష్‌యాదవ్, చిర్ర మహేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి గొడిచర్ల మోజేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షులు చిర్ర మధు, గుండా వీరన్న, దేవరకొండ మహేష్, యూత్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


గ్రంథాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సీతారామశాస్త్రి

పెన్‌పహాడ్ : గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కేవీ సీతారామశాస్త్రి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలోని రికార్డులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడారు. గ్రంథాలయాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయంలో 2508 పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఇంకా ఏమైనా పుస్తకాలు అవసరమైతే తెప్పించి అందుబాటులో ఉంచుతామని అన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎంవీ రంగారావు, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ దార శ్రీనివాస్, సిబ్బంది మధు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం ద్వారా రూ.6 లక్షలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్: ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు రూ.6 లక్షల ఆర్థిక సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు అయినా కొత్త రేషన్ కార్డులు, కొత్త ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఐరన్, సిమెంటు, కూలీల రేట్లు విపరీతంగా పెరిగినందున ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు కాకుండా రూ.6 చెల్లించాలన్నారు. దళిత బంధు, కులవృత్తుల వారికి ప్రభుత్వం చేస్తున్న ఆర్థికసాయంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు

తిరుమలగిరిలో వర్షం

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం మోస్తారు వర్షం కురిసింది. పత్తి, ఇతర ఆరుతడి పంటలకు వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తిరుమలగిరిలోని ప్రతి బుధవారం జరిగే వారాంతపు సంత వర్షం నీటితో బురదమయంగా మారడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


బురదమయంగా మారిన వారాంతపు సంత

ఎస్‌బీఐ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

నడిగూడెం: ఫ్రీజ్ చేసిన రైతుల ఖాతాలను వెంటనే తెరవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి విస్మరించారని ఆరోపించారు. రైతుల ఖాతాలు ఫ్రీజ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బూతుకూరి వెంకటరెడ్డి, బృందావనపురం సర్పంచ్ హనుమయ్య, నాయకులు కొరట్ల శ్రీనివాస్, చంద్రయ్య, రవి ఉన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి


సూర్యాపేట రూరల్ : మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


పెన్‌పహాడ్ : సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాంపతి

పెన్‌పహాడ్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేలా కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి రాంపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో హరితహారం కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లోన్ని రోడ్లు, కాలువల వెంట మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, ఏఓ కృష్ణసందీప్, ఏపీఎం అజయ్, ఈసీ ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : 9వ విడత హరితహారంలో మొక్కలను నాటేందుకు నర్సరీలో మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎండ్లపల్లి గ్రామంలో హరితహారంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీసి వాటిని పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో పచ్చని వాతావరణం ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రతిఒక్కరూ హరితహారంలో భాగస్వాములై మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి గీతా తదితరులు పాల్గొన్నారు.

హరితహారం పనులు ముమ్మరంగా చేపట్టాలి

మద్దిరాల : హరితహారం పనులు ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీఓ సరోజ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువల వెంట హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను ఆమె పరిశీలించి మాట్లాడారు. హరితహారం పనులను వేగవంతం చేయాలని ప్రధానంగా ఎస్సారెస్పీ కాలువల వెంట ఈ మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

చివ్వెంల(సూర్యాపేట) : గ్రామంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ కలకొండ కరుణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో హరితహారంలో భాగంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. మొక్కల పెంపకంతో జీవకోటికి ప్రాణధారమైన ఆక్సిజన్ లభిస్తుందన్నారు. అదే విధంగా వాతావరణ కాలుష్య నివారణకు ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో విజయ, పద్మ, విష్ణు, పుల్లయ్య, నాగరాజు, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

తుంగతుర్తి : మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సూర్యతండాలో హరితహారంపై పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మొక్కల పెంపకాన్ని చేపట్టి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. మొక్కల పెంపకంతోనే కరువు, కాటకాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి సభ్యులు గంట భిక్షపతి, మాగి శంకర్, వేముల శ్రవణ్, ఈర్ల సాయి, పల్స నిర్మల, సిరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, ఇందిరా ప్రియదర్శిని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మద్దిరాల : ఎస్సారెస్పీ కాల్వ వెంట నాటిన మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సరోజ


చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లో హరితహారం మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్


తుంగతుర్తి : సూర్యతండాలో హరితహారంపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా సభ్యులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎస్టీఓకు వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు

తుంగతుర్తి : రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెడద సోమయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్టీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతినెలా మొదటి తేదీన పెన్షన్ చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. 2023 పీఆర్సీని వెంటనే చెల్లించి, 30శాతం ఐఆర్ ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి అంతయ్య, ఓగునూరి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి

తుంగతుర్తి : పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని తుంగతుర్తి డివిజన్ పశువైద్యశాఖ ఏడీ రవిప్రసాద్ అన్నారు. జునోసిస్ డే సందర్భంగా నేడు(గురువారం) మండల కేంద్రంలోని పశువైద్యశాలలో 4నెలల వయస్సు నిండిన పెంపుడు కుక్కలకు ఉచితంగా రెబిస్ వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నట్లు బుధవారం ఆయన తెలిపారు. జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధిని జునోటిక్ వ్యాధి అంటారన్నారు.

పెద్దులు మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సీతారాంరెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామానికి చెందిన కొండమీది పెద్దులు(86) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపిరెడ్డి, అమృతారెడ్డి ఉన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అర్వపల్లి : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. బుధవారం మండలంలోని లోయపల్లిలో సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో తెలంగాణకు హరితహారం, సీజనల్ వ్యాధులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు కళాకారులు ఆట, పాటలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, గజ్జి మంజుల, కుందమళ్ల నాగలక్ష్మి, పోతరాజు శిరీష, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లైసెన్స్‌లు మంజూరు చేయిస్తా


టాపింగ్ టెస్ట్‌లో పాల్గొన్న గీత కార్మికులు

చిలుకూరు: అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్స్‌లు మంజూరు చేయిస్తానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపకుడు, ప్రముఖ న్యాయవాది కేఎల్‌ఎన్ ప్రసాద్ అన్నారు. బుధవారం చిలుకూరులోని గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో టాపింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా గీత కార్మికులకు టాపింగ్ టెస్ట్‌లు చేయించి లైసెన్స్‌లు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండా అన్నపూర్ణ, ఎంపీటీసీ బెల్లంకొండ రమణ నాగయ్య, గౌడ సంఘం నాయకులు కొండా సోమయ్య, యడవెల్లి పుల్లారావు, కలాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మరథీ సైదులు, కొండా వీరబాబు, డైరెక్టర్ బెల్లంకొండ సూర్యప్రకాశ్, అమరగాని కాశయ్య, వెంకయ్య, రవి, వీరబాబు, ధనమూర్తి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన బచ్చలకూరి వెంకటయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మహేశ్వరం చంద్రకళ, బొడ్డుపల్లి అంజయ్య, కట్ట మల్లారెడ్డి, బండపల్లి సాగర్, జటంగి గణేష్, తీగల శ్రీనివాస్‌రెడ్డి, కేశవచారి, మొగుళ్ల వెంకన్న, సైదులు, సంజీవ తదితరులు ఉన్నారు.